క్లుప్తంగా

ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

జి.సిగడాం: జి.సిగడాం ఉన్నత పాఠశాలలో 1990–91లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని ప్రకటించారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులు భూపతి వెంకటరమణమూర్తి, జడ్డు శ్రీరామమూర్తి, జడ్డు జగదాంబ, బంగారాజు, కృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు.

లలితాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని తమ్మినాయుడుపేటలో గల లలితాదేవీ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని, అమ్మవారి చెట్టును ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో సామూహిక సూర్య నమస్కారాలు



సూర్య నమస్కారాలు చేస్తున్న మహిళలు

అరసవల్లి: ఆరోగ్యక్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి సన్నిధి అనివెట్టి మండపంలో మారుతి వాకర్స్ ఎలైట్ సంస్థ ఆధ్వర్యంలో 108 మంది మహిళలచే సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి, ఎలైట్ గవర్నర్ కొంక్యాన మురళి, యోగా గురువు పి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి



ముషినివలసలో బూత్ కమిటీ సభ్యులతో మండల నాయకులు

జి.సిగడాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం పిలుపునిచ్చారు. మండలం పరిధిలోని ముషినివలస, బాతువ, పాలఖండ్యాం తదితర గ్రామాల్లో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసేందుకు కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులంతా కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న కాయితి వెంకటరమణ

రణస్థలం: ఐక్యతతో పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి కాయితి వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలోని కొండములగాం సమీపంలో ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయి యాదవుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులందరూ సంఘటితంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. మన అభివృద్ధి, సంక్షేమం ఆకాంక్షించే పార్టీలకే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. 25 వేల పైచిలుక ఓట్లు ఉన్నాయని, నామినేటెడ్ పోస్టులు, ఇతర అంశాల్లో ప్రధాన పార్టీలు గుర్తించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా యూత్ ప్రెసిడెంట్ ముద్దాడ రాజశేఖర్, గౌరవ అతిథులు ఎం.సుభాష్ చంద్రబోష్, ముల్లి సన్నిబాబు, సభ్యులు మన్నెల శ్రీనివాస్, ఇ.తిరుపతిరాజు, జోగ శ్రీనివాసరావు, జాడ కేశవ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

- టీడీపీ కూటమితో ఒరిగేదేమీ లేదు
- ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



చేయూత చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. జే.ఆర్.పురం పంచాయతీ దన్నానపేటలో నాల్గో విడత వైఎస్సార్ చేయూత సంబరాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాలుగు విడతల్లో రణస్థలం మండలానికి రూ.45 కోట్లు చేయూత రూపంలో మహిళల ఖాతాల్లో జమయ్యాయన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా సీఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారన్నారు. కుటిల రాజకీయాలు చేసేందుకు ఏర్పడిన అనైతిక పొత్తులతో రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు వల్ల చంద్రబాబు కేసుల నుంచి బయట పడడానికేనని, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం కాదన్నారు. జగనన్న అందజేస్తున్న సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా ఇవ్వడం లేదని, అందుకే జగన్ అంటే ప్రతిపక్షాలకు భయమన్నారు. మహిళల ఖాతాల్లో అమ్మఒడి, చేయూత, ఆసరా, రుణమాఫీ, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాల డబ్బులు నేరుగా వేస్తున్నామన్నారు. మళ్లీ మంచి జరగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, రెడ్డి విశ్వేశ్వరరావు, మహంతి చినరామినాయుడు, మహిళా విభాగం అధ్యక్షురాలు గురాన మానస, ఎంపీడీఓ, రమణమూర్తి, వెలుగు ఏపీ రవికుమార్, ఏపీఎం వెంకటరత్నం, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రామిశెట్టి



చేయూత సంబరాల్లో పాల్గొన్న మహిళలు

లక్ష్మమ, జే.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సేవలు భేష్

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



వస్త్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వైద్యులు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది సేవలు వెలకట్టలేనివని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల కమ్యూనిటీ హెల్త్ అధికారులు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య రంగంలో ఎన్‌హెచ్ఎంలు, వైద్యుల నియామకాలు, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం వంటి ఎన్నో సంస్కరణలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేశారని గుర్తు చేశారు. ఏ ఆస్పత్రిలోనూ మందుల కొరత అనేది లేకుండా చేశారని, గతంలో కంటే ఆస్పత్రుల నిర్వహణ ఎంతో చక్కగా ఉందన్నారు. రూ.3 వేలు ఉన్న ఆశ వర్కర్ల వేతనం రూ.10 వేలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం వైద్యులు, సిబ్బంది, ఆశ వర్కర్లకు వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ గొర్లె పరిమళ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

రణస్థలం: రాష్ట్రంలో చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు అన్నారు. మండల కేంద్రంలో కౌలు రైతుల సమస్యలపై విలేకరులతో మాట్లాడారు. కనీస మద్దతు ధర రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని, మొక్కజొన్న తదితర పంటల కొనుగోలు కేంద్రాలు వెంటనే అన్ని ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు, టి.అప్పలనాయుడు, ఆదినారాయణ పాల్గొన్నారు.

జేఎల్స్‌గా అవకాశం కల్పించాలి



మంత్రి బొత్సకు వినతిపత్రం అందజేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జూనియర్ లెక్చరర్లు (ఫిజికల్ ఎడ్యుకేషన్)గా అర్హులైన స్కూల్ అసిస్టెంట్లను పదోన్నతల ద్వారా భర్తీ చేయాలని వ్యాయామ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంవీ రమణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణను ఆయన క్యాంపు ఆఫీసులో ఉత్తరాంధ్ర జిల్లాల పీడీ, పీఈటీ సంఘ నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంవీ రమణ తదితరులు మాట్లాడుతూ.. ప్రభుత్వ, జిల్లా పరిషత్ పరిధిలోని అర్హులైన స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ పీఈ) న్యాయస్థానానికి వెళ్లిన వారికే కాకుండా జీవో నంబర్79 ప్రకారం అర్హులైన స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)లందరికీ సీనియార్టీ ప్రకారం పదోన్నతలు కల్పించాలని మంత్రికి విన్నవించినట్టు చెప్పారు. సానుకూలంగా స్పందించిన మంత్రి అర్హులైన పీడీలకు అందరికీ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చినట్టు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల పరిధిలోని జోన్-1 స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) నాయకులు ఎం.సాంబమూర్తి, ఎల్‌వీ రమణ, ఎల్.లలిత్‌కుమార్ ఉన్నారు.

101 మంది రక్తదానం



న్యూసెంట్రల్ స్కూల్‌లో రక్తదాన శిబిరం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక పీఎన్ కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్ 30వ వార్షికోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం జరిగింది. సుమారుగా 101 మంది రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా స్కూల్ సిబ్బందితోపాటుగా పలువురు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్స్ పి.శ్రీకాంత్, పి.శ్రీదేవి, ప్రిన్సిపాల్ బి.మల్లేశ్వరరావు, స్కూల్ సిబ్బంది, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, పెంకి చైతన్య, బి.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం రేపు

కాశీబుగ్గ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా పండుగను ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు క్యాంప్ కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదల అయ్యింది. ఆ రోజు ఉదయం పది గంటలకు పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద జెండా పండుగతో పాటు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ నుంచి చైర్మన్, కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, మూడు మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ వివిధ కేటగిరీలకు చెందిన ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

క్రికెట్ విజేతగా డిజిటల్–వెల్ఫేర్ అసిస్టెంట్ టీమ్



క్రికెట్ పోటీ విజేతలు

కొత్తూరు: మండలంలోని గ్రామ సచివాలయం ఉద్యోగుల క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను మెట్టూరులో రెండు రోజులుగా నిర్వహించారు. ఈ పోటీలను స్థానిక ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ పర్యవేక్షించారు. 11 టీమ్‌లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో డిజిటల్– వెల్ఫేర్ అసిస్టెంట్ టీమ్ విన్నర్‌గా నిలిచారు. రన్నర్‌గా ఇంజినీరింగ్ అసిస్టెంట్, జూనియర్ లైన్‌మెన్ టీమ్ నిలిచాయి. విన్నర్స్‌కు రూ.6 వేలు, రన్నర్స్‌కు రూ.3 వేలు నగదు అందజేశారు. ఈ పోటీలు సచివాలయ ఉద్యోగులు అల్లు తిరుపతిరావు, జగపతిబాబు, నవీన్, మిన్నారావు, పృథ్వీ, మోహన్ ఆధ్వర్యంలో జరిగాయి.

'ఆ మూడు పార్టీల పొత్తు అనైతికం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు అనైతికమని జైభారత్ నేషనల్ పార్టీ పార్లమెంటరీ కోఆర్డినేటర్ ఇప్పిలి సీతరాజు, లీగల్ సెల్ కన్వీనర్, అధికార ప్రతినిధి చౌదరి లక్ష్మణరావు, అసెంబ్లీ కోఆర్డినేటర్ రాగోలు నాగశివ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హోదా, విభజన హామీలను, విశాఖ రైల్వే జోన్, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై రాతపూర్వకమైన హామీ తీసుకోకుండా కేవలం రాజకీయ స్వార్థం కోసం పొత్తుకుదుర్చు కోవడం ద్వారా ఆ మూడు పార్టీలకు విలువల్లేవని స్పష్టమైందన్నారు. అనైతిక పొత్తులను ప్రజలు నమ్మరన్నారు.

'చదవడం మాకిష్టం'



చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పద్యాలు, కథల పుస్తకాలను విద్యార్థులు చదివారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ మలిపెద్ది చంద్రశేఖర్ సూచించారు.

కషాయాలతో తెగుళ్ల నివారణ



కషాయాలను తయారు చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: పంటకు ఉడుకు తెగుళ్లు రాకుండా కషాయాలను వాడాలని ప్రకతి వ్యవసాయం తమ్మినాయుడపేట యూనిట్ ఇన్‌చార్జ్ చంద్రకళ సూచించారు. కొత్తపేటలో పంటలకు ఉడుకు తెగుకు సోకడం వల్ల వచ్చే నష్టాలను వివరించారు. దీని వారణకు వావిలాకు, తూటికాడ కషాయం తయారుచేశారు. మహిళా రైతులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి.. ప్రాణభిక్ష పెట్టి..



రక్తదానం చేస్తున్న విశ్వనాథం

కాశీబుగ్గ: బిడ్డ సంచి సమస్యతో బాధపడుతున్న మహిళలకు 'ఓ' పాజిటివ్ రక్తం అవసరమైంది. ఈ విషయం తెలుసుకున్న ఓ యువకుడు రక్తదానం చేసి ఆమెకు ప్రాణభిక్ష పెట్టారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పాత జాతీయ రహదారిలో ఉన్నటువంటి సాయిరాజ్ ఆస్పత్రికి ఓ మహిళకు రక్తం తగ్గిపోవడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. విషయం తెలిసిన వెంటనే వజ్రపుకొత్తూరు మండలం పెద్ద మురహరిపురం గ్రామానికి చెందిన గొరకల విశ్వనాథం ఆదివారం ఆస్పత్రికి చేరుకొని రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు.

ఘనంగా శివపార్వతుల త్రిశూల స్నానం



ఉత్సవ మూర్తులకు త్రిశూల స్నానం చేస్తున్న దృశ్యం



స్వామివారిని నంది వాహనంపై ఊరేగిస్తూ..



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర స్వామి దేవాలయంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా శివపార్వతులకు నాగావళి నదిలో త్రిశూల స్నానం ఆదివారం నిర్వహించారు. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో శివపార్వతుల ఉత్సవ మూర్తులను భక్తులతో కలసి నంది వాహనంపై ఆలయం నుంచి నాగావళి నది వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ శివపార్వతుల ఉత్సవ మూర్తులను నదిలో ఉంచి స్నానం చేయించారు. అనంతరం ఉత్సవ మూర్తులను తిరిగి ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకువచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

సావిత్రిబాయి పూలేకి ఘనంగా నివాళి



సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా బాలికల విద్య కోసం కృషి చేసిన ఘనత సావిత్రి బాయి పూలేకి దక్కిందని శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వర రావు, చౌదరి లక్ష్మణరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావులు అన్నారు. ఆదివారం సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళంలోని స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అన్ని పాఠశాలల్లో సావిత్రి బాయి విగ్రహాలు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం సభ్యులు అలీ బేగ్, బీసీ న్యాయవాదుల సంఘం సభ్యులు బీవీ రమణ, పైడి జోగారావు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురు చేరిక



యువకులకు పార్టీ కండువాలు వేస్తున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్: నగరంలోని టీడీపీ, జనసేన పార్టీల నుంచి పలువురు యువకులు రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో ఆదివారం చేరారు. పార్టీ నాయకుడు మండవల్లి రవికుమార్ అధ్యక్షతన మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో 70 మంది యువకులకు మంత్రి ధర్మాన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి అహర్నిశలూ పనిచేసి మంచి గుర్తింపు పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, ఈశ్వర్, దాలింగరావు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



చెక్కులను అందజేస్తున్న శ్రీనివాస్

కోటబొమ్మాళి: ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సంబంధిత వ్యక్తులకు ఆదివారం పంపిణీ చేశారు. పెద్దహరిశ్చంద్రపురం గ్రామానికి చెందిన భగాది భానుప్రసాద్‌కు రూ. 60 వేలు, ఎత్తురాళ్లపాడుకు చెందిన మామిడి సూర్యనారాయణకు రూ. 80 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గురివెల్లి కేశవరావు, ఎంపీటీసీ సభ్యులు బగాది దివాకర్, పూజారి సత్యం, ఫీల్డుఅసిస్టెంటు సోమేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ మెట్ట శాంతారావు ఉన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు

- కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరెడ్డి

వజ్రపుకొత్తూరు రూరల్: క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు పడడంతోపాటు గ్రామాల్లో శాంతి వాతావరణానికి దోహదం చేస్తాయని కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ జి.రాధిక అదేశాల మేరకు నగరంపల్లిలో స్థానిక ఎస్సై సీహెచ్ రామారావు ఆధ్వర్యంలో ఆదివారం ఎస్పీ కప్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు, ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలు నెలకొల్పేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా క్రీడలు, ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. క్రీడలతో గ్రామీణ ప్రాంతాల్లో యువకుల మధ్య సోదరభావం మెరుగుపడుతుందన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి క్రీడలు చక్కటి మార్గం అని అన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. అనంతరం క్రికెట్, వాలీబాల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

నేడు జీడి పిక్కల మద్దతు ధర కోసం ధర్నా

పలాస: కాశీబుగ్గ మహాత్మాగాంధీ విగ్రహం వద్ద సోమవారం ఉదయం జీడి పిక్కల మద్దతు ధర కోసం ధర్నా నిర్వహిస్తున్నట్టు ఏపీ జీడి రైతాంగం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉద్దానం ప్రాంత జీడి రైతులంతా హాజరు కావాలని కోరారు.